క్లుప్తంగా

వృత్తి, విద్య కోర్సులపై అవగాహన



ఉయ్యాలవాడ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: వృత్తి, విద్యా కోర్సులతో విద్యార్థులకు మంచి భవిష్యతు ఉంటుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం పాఠశాల వృత్తి, విద్యా కోర్సుల విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ఉయ్యాలవాడలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఐటీ, ఐటీఈఎస్ ట్రైనర్ వెంకటరమణతో కలిసి సందర్శించారు. బ్యాంకులో ప్రతి రోజు జరిగే లావాదేవీలపై మేనేజర్ హరీష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అసిస్టెంటు హిమ కామాక్షి, బ్యాంకు సిబ్బంది, ట్రైనర్ హుసేన్‌వలి పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసెను పరిశీలిస్తున్న తహశీల్దార్ పుష్పకుమారి

శిరివెళ్ల: జీనేపల్లెకు చెందిన నాగమ్మ నివాసం ఉంటున్న గుడిసె గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయింది. ఈ ఘటనలో రూ.5 వేల నగదు, బస్తా బియ్యం, దుస్తులు అగ్నికి అహుతయ్యాయి. విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్ పుష్పకుమారి గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. బాధితురాలికి 25 కేజీల బియ్యం, 4 కేజీల కంది బేడలను అందజేశారు. ఇన్‌చార్జ్ వీఆర్వో ప్రసాదు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ



పాడి రైతులకు మందులను అందజేస్తున్న ఏడీ వరప్రసాద్, వైద్యాధికారి సాయిబాబా

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట గ్రామంలో ఏడీ వరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో 730 జీవాలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు ఏడీ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 9 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించి 90 పెద్ద పశువులకు, 68 దూడలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు చెప్పారు. అలాగే 98 జీవాలకు బొబ్బ వ్యాధి టీకాలు వేశారు. ముత్యాలపాడు పశువైద్యాధికారి సాయిబాబా, వీఏ ప్రదీప్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతికి డాక్టరేట్



ముల్లా షేక్ ఆయిషా

చాగలమర్రి: మండల కేంద్రంలోని చిన్నమకానం వీధికి చెందిన ముల్లా షేక్ ఆయిషా బేగంకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, డైరెక్టర్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈమె ఎమ్మెస్సీ అగ్రికల్చర్, పీహెచ్‌డీని బెంగళూరులోని గాంధీ కృషి విద్యానికేతన్ వర్సిటీలో ప్రొఫెసర్ డాక్టర్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. 2018 నుంచి 2024 మధ్య క్రాప్ ఫిజియాలజీ (మొక్కలు ఎలా పనిచేస్తాయి, పర్యావరణానికి ఎలా స్పందిస్తాయి) అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించడంతో డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె వర్సిటీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వర్సిటీ స్నాతకోత్సవంలో పట్టాను అందుకోనున్నట్లు ఆమె తెలిపారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థినులతో షేక్షావలి రెడ్డి

నంద్యాల (న్యూటౌన్): జిల్లాస్థాయిలో నంద్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పట్టణానికి చెందిన శ్రీ గురురాజా ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 24న నంద్యాలలో 8,9 ,10 తరగతి బాలికలకు ప్రత్యేకంగా డిగ్నిటీ ఆఫ్ రూల్స్ అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించగా.. ఇంగ్లిష్ విభాగంలో ఎస్. కాత్యాయని ప్రథమ స్థానం, జి హన్సిక రెడ్డి ద్వితీయ స్థానం, తెలుగు విభాగంలో విహారికా ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్. మధుసూదన్ రావు, డాక్టర్ జి.రవికృష్ణ, డాక్టర్ లక్ష్మీసౌజన్య, డాక్టర్ అరుణ కుమారి గురువారం బహుమతులు అందజేశారు.

అధికారం కోసమే మోసపూరిత హామీలు

- 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే బాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా ?
- ఎనిమిది నెలలు అయినా హామీల అమలు ఏదీ ?
- సంపద సృష్టి అంటే.. మీ ఎమ్మెల్యేలు అందినకాడికి దోచుకోవడమా ?
- త్వరలో ఇంటింటికీ వెళ్లి 'కూటమి' మోసాలపై చైతన్యం కల్పిస్తాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

ఆళ్లగడ్డ: ఎలాగైనా అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా ఎన్నికల వేళ సీఎం చంద్రబాబునాయుడు లెక్కలేనన్ని మోసపూరిత హామీలు ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంతో ఆశతో నమ్మి ఓట్లు వేసిన ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తిగా మోసం చేశారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు ఇప్పుడే పథకాలు ఇవ్వలేమని అనడం బాధాకరమన్నారు. దేశంలో నేనే సీనియర్, రాజకీయాల్లో నలభై సంవత్సరాల ఇండస్ట్రీ.. నాలుగు సార్లు ముఖ్యమంత్రి అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు ఎన్నికల ముందు హామీలు ఇచ్చే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే రాష్ట్రం మరో శ్రీలంక అవుతోందని బాకా ఊది ఎన్నికల ముందు అంతకంటే రెట్టింపుగా సంక్షేమ పథకాలు అందజేస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు చేతకాదనడం సమంజసమేనా అని నిలదీశారు. ఇంట్లో ఎంత మంది చదువుకుంటుంటే అంత మందికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి తల్లులను, 50 ఏళ్లకే రూ.4 వేలు పింఛన్ ఇస్తామని బీసీ, ఎస్సీ, ఎస్టీలను, 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని అక్కచెల్లెమ్మలను, ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని అన్నదాతలను, ఉద్యోగాలు కల్పిస్తాం లేకుంటే నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని నిరుద్యోగులను ఇలా ప్రతి ఒక్కరినీ దగా చేసిన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. సంపద సృష్టి అంటే మీ ఎమ్మెల్యేలు కోడి పందేలు, పేకాట శిబిరాలు, బెల్టు షాపులు నిర్వహిస్తూ విచ్చలవిడిగా దోచుకోవడమేనా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ మోసంపై ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, గంగుల రామిరెడ్డి ఉన్నారు.

నమో నారసింహా..

ఆళ్లగడ్డ: అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి పార్వేటు ఉత్సవ పల్లకీ గురువారం రూరల్ మండలం బాచ్చాపురం గ్రామంలో కొలువుదీరింది. పల్లకీలో కొలువుదీరిన ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములను గ్రామస్తులు బారులు దీరి దర్శించుకున్నారు. గ్రామంలోని పలు తెలుపులపై కొలువుదీరిన ఉత్సవ పల్లకీకి ప్రజలు విశేష పూజలు చేశారు. అనంతరం ఒక తెలుపు నుంచి మరో తెలుపుపైకి గ్రామస్తులు భుజాలపై మోసుకుంటూ నడిచారు. స్వామి రాకతో గ్రామంలో ఇళ్ల బంధుగణంతో కళకళలాడాయి.



బాచ్చాపురంలో పూజలు అందుకుంటున్న స్వామివారు

ఉపాధి కూలీలకు ఆన్‌లైన్ హాజరు



ఉపాధి పథకంపై ప్రజా చర్చ జరుగుతున్న దృశ్యం

శిరివెళ్ల: ఉపాధి పథకంలో కూలీలకు ఆన్‌లైన్ హాజరు విధానం అమలవుతుందని పీడీ జనార్దనరావు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి పథకం పనులపై సామాజిక తనిఖీపై బహిరంగ ప్రజా వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకంలో అవకతవలను నివారించేందుకు పనుల వద్ద వ్యవసాయ కూలీల ముఖ గుర్తింపు పద్ధతి ప్రవేశ పెడుతున్నామన్నారు. అనంతరం డీఆర్‌డీపీలు 2023–24 సామాజిక తనిఖీల నివేదికలను చదివి వినిపించారు. పనుల వద్ద నిధుల వినియోగంపై సూచిక బోర్డులు పెట్టలేదని నివేదికలు ఇవ్వగా ప్రతి ఉపాధి పని వద్ద సూచిక బోర్డులు తప్పనిసరిగా పెట్టాలని పీడీ ఆదేశించారు. పర్యవేక్షణ లోపించడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి బుధవారం జరిగే సమావేశంలో లోపాలను చర్చించుకోవాలని, తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహించడం ఎందుకని మండిపడ్డారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.6.88 కోట్ల వ్యవసాయ కూలీలకు వేతనాల చెల్లింపు, మరో రూ.2.84 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ కింద ఖర్చు చేయగా అందులో రూ.76,796 రికవరీకి పీడీ ఆదేశించారు. మరో రూ.4500 జరిమానా విధించారు. రీ- ప్లాంటేషన్‌కు రూ.4.69 లక్షలను పీడీ ఆదేశించారు. ఏపీడీలు బాలాజీనాయక్, అన్వరాబేగం, డ్వామా విజిలెన్స్ సూపరింటెండెంట్ షిబారాణి, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గంగాధర్, ఎస్సార్పీ కాంతయ్య, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఏపీఓ రామసుబ్బయ్య, పీఆర్, హౌసింగ్ ఏఈలు రవికుమార్, అహమ్మద్‌బాషా, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న కరెస్పాండెంట్ రాచమడుగు రమణ గుప్తా

చాగలమర్రి: లాభాపేక్ష లేకుండా గ్రామీణ ప్రాంతంలోని యువతకు విద్య ద్వారా విజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా 1979లో వాసవీ విద్యా సమాజం ఆధ్వర్యంలో ఎస్‌వీఎంవీఎస్ఆర్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసినట్లు కరెస్పాండెంట్ రాచమడుగు రమణ గుప్తా తెలిపారు. ప్రిన్సిపాల్ ఓబులేసు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కళాశాల 46వ వార్షికోత్సవ కార్యక్రమానికి కరెస్పాండెంట్‌తో పాటు విశ్రాంత ప్రిన్సిపాల్ పోలిశెట్టి, గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి దేశ భక్తి గీతంతో ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఓబులేసు కళాశాల నివేదికను సమర్పించారు. ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయంతో చదువుకుని గొప్పస్థాయికి చేరుకోవాలన్నారు.అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాసవీ విద్యా సమాజం అధ్యక్షుడు క్రిష్ణం ప్రసాద్, ఎస్‌వీ డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ బి.రఘురాం, ప్రధాన కార్యదర్శులు పుల్లారెడ్డి, సాగర్, ట్రెజరర్ రామ శేషయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే ఎమ్మెల్యే తప్పుడు ఆరోపణలు



భూమా కిషోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: జగత్ డెయిరీ కోసం విజయ డెయిరీ నుంచి రూ.కోటికి పైగా రుణం తీసుకుని ఎగవేయడంతో పాటు అదే డెయిరీపై రూ.70 లక్షలకు పైగా ఉన్న కరెంటు బిల్లులు చెల్లించకుండా ఉన్న నీకు మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమ కోసం చేసిన కార్యక్రమాలపై మాట్లాడే అర్హత ఉందా? అని ఎమ్మెల్యే అఖిలప్రియను వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తనపై చేసే విమర్శలకు ఆధారం చూపాలని ఎమ్మెల్యే అంటున్నారని, కోటకొండలో ఎర్రమట్టి అక్రమంగా తరలిస్తుండడంపై ఆ గ్రామ నాయకులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. శిల్పశాలలకు గ్రానైట్ రాళ్లు దించడానికి వచ్చిన లారీ వారిని మామూళ్ల కోసం బెదిరిస్తే.. బండలను మీరే అమ్ముకోండని లారీని మీ ఇంటి ముందు ఉంచిన మాట వాస్తవం కాదా చెప్పాలన్నారు. ఎమ్మెల్యే అక్రమాలపై ఆ పార్టీ కార్యకర్తలే బహిరంగంగా మాట్లాడుకుంటున్నార ఎద్దేవా చేశారు. వాటి మాటలు వింటే ఎమ్మెల్యే సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తుందన్నారు. ముందుగా ఎమ్మెల్యే అఖిలప్రియ చేస్తున్న అక్రమాలను, అన్యాయలను పక్కన పెట్టి తర్వాత నీతులు చెప్పాలని హితవుపలికారు. ప్రజలను మభ్యపెట్టాలని తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమన్నారు. ఇప్పటికైనా తప్పుడు విమర్శలు మానుకుని ఇచ్చిన హామీలు ఎలా అమలు చేయాలో ఆలోచించాలని లేకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

మహాత్ముడికి ఘన నివాళి



చాగలమర్రిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చాగలమర్రి: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీ విగ్రహానికి అధ్యక్షుడు వంకదారు లక్ష్మణబాబు, కోశాధికారి నవత ప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య ప్రముఖులు మల్లికార్జున, రవి, బచ్చు సుబ్రమణ్యం, జ్వాలా నరసింహుడు, శశికుమార్, చెంచు సుబ్బారావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా

యువత గాంధీని ఆదర్శంగా తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు, యువత మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా సూచించారు. గురువారం మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సత్యం, అహింసా ఆయుధంగా కోట్లాది మంది భారతీయులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అందించేందుకు పోరాడారని కొనియాడారు. అలాగే గాందీచౌక్‌లో కమిషనర్ నిరంజన్‌రెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని బాలా అకాడమీ పాఠశాలలో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి



మాట్లాడుతున్న నాగరాజు

చాగలమర్రి: విద్యుత్ సర్‌చార్జీలు, ట్రూఅప్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తు సీపీఎం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాత గురువారం చాగలమర్రికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గాంధీ సెంటర్‌లో సీపీఎం జిల్లా నాయకులు నాగరాజు మాట్లాడుతూ.. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాబోవు 3 మూడేళ్లలో సీపీఎం ప్రజా సమస్యలపై చేసే పోరాటాలకు ప్రజల మద్దతు కావాలని కోరారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో నిర్వహిస్తున్న మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. జీపు జాతలో సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్, కమిటీ సభ్యులు నరసింహ, బాల వెంకటనాయక్, ఏ.నాగరాజు, ప్రజా నాట్య మండలి కళాకారులు నాగరాజు, సుబ్బరాయుడు, సుబ్బయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోస్పాడు: బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అందజేసే రుణాలకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ అమానుల్లా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి బీసీ కార్పొరేషన్ కింద 55 యూనిట్లకు రూ.116. 25 లక్షలు, ఈబీసీ కింద 3 యూనిట్లుకు రూ.4 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఇందులో 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు లోను కింద రుణాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ ఓపెన్ అయ్యిందని, వచ్చేనెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

జీవో నంబర్ 117 ఉపసంహరణపై పరిష్కారం చూపాలి

నంద్యాల(న్యూటౌన్): జీవో నంబర్ 117 ఉపసంహరణ అంశంపై క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు,ఉపాధ్యాయ సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేసి అందరికీ అమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచించాలని ఎస్టీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోర్లసుధాకర్,కాలంగిరి కుమార్ కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ జనవరి9న ఇచ్చిన మెమో ప్రకారమే తరగతులు విలీనంచేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీ చట్టంపై కూడా ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను సేకరించాలన్నారు. ఒక కిలోమీటరు పరిధిలో ఉండే 3,4,5 తరగతులను ఎస్ఎంసీ అమోదంతో ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయాలన్నారు. ఉపాధ్యక్షులు ధరణి,ఉపేంద్ర, కార్యదర్శి రామకృష్ణ,నాగరాజు,రాము పాల్గొన్నారు.

కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకోండి

దొర్నిపాడు: వివిధ రంగాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, తదితర కార్పొరేషన్ల ద్వారా ఏపీ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టం (ఏపీఓబీఎంఎంఎస్) నిరుద్యోగులు కార్పొరేషన్ రుణాలకు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా, పారిశ్రామిక, వ్యవసాయం, జనరిక్ మెడిసిన్ షాపుల ఏర్పాటు కొరకు డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ చదివిన అభ్యర్థులు తగిన ధ్రువ పత్రాలు సర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 8వ తేదీలోగా అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మద్యం దుకాణ ఏర్పాటుకు..

బొమ్మలసత్రం: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఈడిగ ఉపకులాలైన ఈడిగ, గౌడ, గౌడ్‌లకు ఒక దుకాణాన్ని ప్రభుత్వం కేటాయించిందని, ఆ కులస్తులు దుకాణ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈడిగ కులాల వారికి 11 మద్యం దుకాణాలు కేటాయించారన్నారు. ఆసక్తి గల వారు పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు నాన్ రీఫండబుల్ కింద రూ.2 లక్షలు చెల్లించాలని సూచించారు. దుకాణం చేజిక్కించుకున్న వారికి రిటైల్ ఎక్సైజ్ టాక్స్‌లో 50 శాతం సబ్సిడీ ఉంటుందని చెప్పారు. ఫిబ్రవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మహానంది అభివృద్ధికి నూతన మాస్టర్‌ప్లాన్

మహానంది: భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని మహానంది దేవస్థానం అభివృద్ధికి సుమారు రూ. 600 కోట్లతో చేపట్టాల్సిన పనులతో నూతన మాస్టర్‌ప్లాన్ రూపొందించామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. గురువారం మహానంది నుంచి వ్యవసాయ కళాశాల వరకు రూ.7.48 కోట్లతో మూడు కిలోమీటర్ల మేరకు తారురోడ్డు నిర్మాణం, పాలేరు వాగుపై వంతెన నిర్మాణాల కోసం భూమిపూజ చేశారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం తరహాలో రింగ్‌రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం ద్వారా నిధులు వచ్చేలా కృషి చేసి, టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని పాల్గొన్నారు.

4న జాబ్ మేళా

నందికొట్కూరు: వచ్చే నెల 4వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా కరపత్రాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీతతో కలసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో రెండు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు.

సూపర్ సిక్స్‌ను గాలికి వదిలేసిన ప్రభుత్వం

- స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదు
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే గపూర్



జీపు జాతను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గపూర్

నంద్యాల (న్యూటౌన్): సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం ఇప్పట్లో సాధ్యం కాదని చంద్రబాబు చేతులెత్తేశాడని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు , మాజీ ఎమ్మెల్యే గపూర్ విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంపు, స్మార్ట్ మీటర్లను ఉప సంహరించుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని గాంధీ చౌక్‌లో జీపు జాతను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడాలని, కడపలో స్టీల్ పరిశ్రమను ఏర్పాటు చేయాలన్నారు. చంద్రబాబు నాయుడు విజన్ 2047 పేరుతో మరోసారి రాష్ట్ర ప్రజలను మాయాజాలంలోకి తీసుకుపోతున్నాడని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు, లోకేష్.. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడానికి చర్యలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. నాడు వద్దన్నవారే ఏర్పాటు చేయడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు తగ్గించక పోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు నెల్లూరులో జరుగుతున్న రాష్ట్ర మహాసభల్లో ప్రజా సమస్యలు, గిట్టుబాటు ధరలు, విద్యుత్ చార్జీలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. పార్టీ జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్,కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు, ఏసు రత్నం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పుల్లా నరసింహ,బాలవెంకట్, నాగరాజు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి



యర్రగుంట్లలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ శారదాబాయి



చాగలమర్రిలోని 2వ సచివాలయం వద్ద గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ తులసి తదితరులు

శిరివెళ్ల: కుష్టి వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నామని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ శారదాబాయి అన్నారు. గురువారం యర్రగుంట్లలో జరుగుతున్న కుష్టి వ్యాధి సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. సర్వే ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమైందని ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటివరకు 67 మంది అనుమానితులను గుర్తించినట్లు చెప్పారు. వారందరికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయిస్తామని చెప్పారు. డాక్టర్లు తేజస్విని, షబ్బీర్‌వలి, నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు కోరారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచు శాంత కుమారి, వివిధ శాఖల ఉద్యోగులు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి లక్షణాలను వివరించారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులు, వీపు, యదపై నొప్పిలేని బుడిపెలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలడం, ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం రావడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లుగా ఉండటం, పాదాల వాపు, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ లేకపోవడం, బొబ్బలు రావడం, వేళ్ల వంకర్లు తిరగడం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ఉయ్యాలవాడ: కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా ఆప్యాయతగా మెలగాలని వైద్యాధికారి రాబర్ట్ కెనడీ సూచించారు. గురువారం విద్యార్థులతో కలిసి కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు షరీఫ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని 2వ సచివాలయంలో, అలాగే ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని గోడిగనూరు గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు పి.అంజలి, శివమోహన్ ఆధ్వర్యంలో, సర్పంచ్‌లు తులసి, సంజీవరాయుడు ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన సదస్సులను ఏర్పాటు చేశారు. అలాగే గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆరోగ్య విస్తరణ అధికారులు సుబ్బారాయుడు, వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న షేక్ బాబులాల్

చాగలమర్రి: స్థానిక కొత్త ఎస్సీ కాలనీలో బుధవారం అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోయిన ఘటనలో బాధిత కుటుంబానికి రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్ గురువారం తనవంతుగా రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె కాలిపోవడంతో మద్దూరు అంకాలమ్మ కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడ్డారని, వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని, ప్రభుత్వం తరపున గృహ నిర్మాణానికి రుణం మంజూరు చేయాలని తహసీల్దారును ఫోన్ ద్వారా కోరారు. వ్యాపార వేత్త చక్రం ముల్లా షబ్బీర్ ఆహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు యువజన విభాగం అధ్యక్షుడు వి.షరీఫ్, ఎంపీటీసీ ఫయాజ్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ షబ్బీర్, గేట్ల మాబు తదితరులు ఉన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

కొత్తపల్లి: ఫిబ్రవరి 2వ తేదీన కొలనుభారతి క్షేత్రానికి వసంత పంచమి వేడుకలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ ఉమారాణి, ఎస్ఐ ఎం.కేశవ అన్నారు. గురువారం మండల పరిధిలోని శివపురం గ్రామ శివారులోని కొలనుభారతి క్షేత్రంలో వసంత పంచమి ఏర్పాట్లను సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటనాయుడులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ భక్తులకు తాగునీరు, భోజనాలు, క్యూలైన్లు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు, మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు రూంలు, వాహనాలకు పార్కింగ్ స్థలం , ట్రాఫిక్ నియంత్రణ, అక్షరాభ్యాసాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఛారఘోషిని నది పూడికతీత పనులు పరిశీలించి ఆలయ పరిసరాలు, సప్తశివాలయాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్ జుబేర్, మండల సర్వేయర్ అనూషరాణి, పంచాయతీ కార్యదర్శి అజ్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

సప్తనదీ జలాల్లో ప్రత్యేక పూజలు

మండలంలోని సప్తనది సంగమేశ్వరం వద్ద ఎగువ పుష్కర ఘాట్ వద్ద సప్తనదీ జలాలలో ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం శ్యామలాదేవి నవరాత్రుల్లో మొదటిరోజు మాఘశుద్ధ పాఢ్యమి గురువారం సప్తనదుల సంగమంలో శ్రీ రాజశ్యామలాదేవి విగ్రహానికి విశేష పూజక్రతులు చేశారు. అమ్మవారికి శ్రీ దుర్గాసూక్త, శ్రీ సూక్త విధానంలో అభిషేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సూర్యనారాయణ స్వామికి అర్ఘ్యములు, విశేష పూజలు చేశారు.